క్లుప్తంగా

ఎరువుల దుకాణాలు తనిఖీ



రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామాల్లో గల ఎరువుల దుకాణాలను శనివారం మండల స్పెషల్ ఆఫీసర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ జిల్లా అధికారి కె.వి.ఎస్. ఉపేంద్ర కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఉన్న ఎరువులను నిశితంగా పరిశీలించారు. పరిశీలించిన ఎరువులు ఈ-పాస్, ఫిజికల్ గ్రౌండ్ బ్యాలెన్స్ టాలీ అయిందీ. లేనిదీ చెక్ చేశారు. రైతులకు అమ్మిన ఎరువుల బిల్లులు పరిశీలించారు. రైతులందరికీ అవసరం మేరకు ఎరువులు కొరత లేకుండా సరఫరా చేయాలని సూచించారు. అదే విధంగా రైతులు కూడా అవసరం మేరకు ఎరువులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి శివలలిత, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్



చిలకలూరిపేటటౌన్: నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచిన ఒక ఆటో డ్రైవర్‌ను చిలకలూరిపేట పోలీసులు అభినందించారు. ఆదర్శంగా నిలిచిన సదరు డ్రైవర్‌కు పోలీసులు నగదు బహుమతి కూడా అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలూరిపేట ఆటో యూనియన్‌కు చెందిన ఆటో డ్రైవర్ డి. దానయ్య తన ఆటోలో ప్రయాణించిన ఓ మహిళ పర్సును మర్చిపోయినట్లు గుర్తించాడు. దానిని తీసుకుని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించాడు. అందులో రూ.6,500 నగదు, ఏటీఎం కార్డులు ఉన్నాయి. ఆటోలో ప్రయాణించి పర్సుపోగొట్టుకున్న మహిళను పిలిపించి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజు, ఇతర సభ్యులు ఆ పర్సును మహిళకు పోలీసులు సమక్షంలో అందజేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీని మెచ్చుకుంటూ అర్బన్ సీఐ పి.రమేష్ రూ.వెయ్యి దానయ్యకు అందించి ప్రోత్సహించారు. ఆటో డ్రైవర్లు దానయ్య చూపిన నిజాయితీని ఆదర్శంగా కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హజరత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.90 లక్షల బోనస్ పంపిణీ



రొంపిచర్ల: మండలంలోని అన్నవరం పాలసేకరణ కేంద్రం పాల ఉత్పత్తిదారులకు 48 మందికి రూ.2,90,000లను బోనస్‌గా పంపిణీ చేశారు. రూ.100ల పాలు సప్లయి చేసిన రైతుకు రూ.7.50లు చొప్పున పంపిణీ చేశారు. అత్యధికంగా పాలు సరఫరా చేసిన కె. వెంకటేశ్వర్లుకు రూ.25 వేలు, కె.శ్రీనివాస రావుకు రూ.21 వేలు, జి.నాగేశ్వరరావుకు రూ.16 వేల రూపాయలు బోనస్‌గా అందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎ. నరేష్ బాబు, సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి, సెంటర్ నిర్వాహకులు పచ్చవ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



బొల్లాపల్లి: వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ఎం.రవి అన్నారు. మండలం లోని వెల్లటూరు పీహెచ్‌సీని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తరచుగా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గర్భిణీ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. వైద్యులు పి.కృష్ణ నాయక్, వి.సాయి తేజ, జి.సీతారామిరెడ్డి, సాంబశివరావు, హర్షవర్ధన్ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మదినిండుగా... జాతీయభావం దండిగ!

- ఐక్యతాభావానికి కేరాఫ్‌గా నిలిచిన జాతీయస్థాయి యోగా పోటీలు
- మూడు రోజుల పాటు మద్దిరాలలో నిర్వహణ
- వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు రాక
- విరబూసిన స్నేహ పరిమళాలు



దేశం నలుమూలల జేఎన్‌వీల నుంచి వచ్చిన విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం వేదికగా జరిగిన జాతీయస్థాయి యోగా విన్యాసాల ప్రదర్శన పోటీలు, విద్యార్థుల మధ్య జాతీయ ఐక్యతా భావానికి అద్భుతమైన వేదికగా నిలిచింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ అద్భుతమైన యోగా విన్యాసాల ప్రదర్శన పోటీలు నవోదయ విద్యాలయ సమితి పరిధిలోని ఎనిమిది రీజియన్ల నుంచి వచ్చిన విద్యార్థులకు ప్రత్యక్షంగా అనుభవించే అవకాశాన్ని కల్పించింది. తమిళనాడు మినహా దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకే ఛత్రం కింద కలిసిపోయిన అద్భుత దృశ్యం అందరినీ ఆకర్షించింది.

కొత్త స్నేహాలు చిగురించాయి

కొన్ని రోజుల క్రితం వరకు ఒకరికొకరు తెలియని వీరు, ఈ మూడు రోజుల్లో మంచి స్నేహితులుగా మారిపోయారు. ఇది కేవలం పోటీ కాదు, భిన్న రాష్ట్రాల మధ్య ఉన్న సామాజిక, సాంస్కృతిక దూరాలను తగ్గించి, వారందరినీ ఒకే భారతజాతిగా దగ్గర చేసింది. ఈ పోటీలు యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మాత్రమే కాకుండా, దేశభక్తి అనే గొప్ప పాఠాన్ని కూడా నేర్పించాయి. ఈ ఘటన నవోదయ విద్యాలయ సమితి ప్రధాన లక్ష్యానికి ఒక గొప్ప నిదర్శనంగా నిలిచింది.

ఈ కార్యక్రమం నవోదయ విద్యాలయాల ప్రధాన లక్ష్యమైన 'జాతీయ ఐక్యతను' ప్రోత్సహించడంలో ఒక మైలురాయిగా నిలిచింది. యోగా అనే సార్వత్రిక భాష ద్వారా ఈ విద్యార్థులు ఏర్పరచుకున్న బంధం, జాతి, మతం, ప్రాంతం వంటి సనాతన అడ్డంకులను అధిగమించడంలో సహాయపడిందని చెబుతున్నారు.

వివిధ రాష్ట్రాల నుంచి చిలకలూరిపేటకు వచ్చిన నవోదయ విద్యార్థులు, ఇక్కడి సంస్కృతి, వాతావరణం, ప్రజల ఆతిథ్యం పట్ల తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ అనుభవం వారిపై ఎంతగా ప్రభావం చూపిందో వారి మాటల్లోనే తెలుస్తుంది.

ఆతిథ్యం నభూతో..



మా హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్ ప్రాంతాల్లో పర్వతాల చల్లదనం, ఆధునికత కలిసి ఉంటాయి. మా ప్రజలు కష్టపడటంలో ముందుంటారు, అందుకే మా ఆహారంలో వెన్న, పాలు ఎక్కువగా ఉంటాయి. ఏపీలో మూడురోజులు అనుభవించిన వాతావరణం, ఇక్కడి వారి ఆతిథ్యం, అతిథి మర్యాదలు తమకు ఎప్పటికీ గుర్తుంటాయి.

– **అస్తా**, 8వ తరగతి విద్యార్థిని, జేఎన్‌వీ హిమాచల్ ప్రదేశ్, చండీఘర్ రీజియన్

వాతావరణం అత్యద్భుతం



మా రాజస్థాన్‌లోని సూరత్ గఢ్, జైపూర్‌లలో చారిత్రక కోటలు, రంగులమయమైన సంస్కృతి ఉంటాయి. కానీ ఇక్కడ పచ్చదనం, చల్లని వాతావరణం మమ్మల్ని బాగా ఆకర్షించాయి. ఇక్కడ అందించిన భోజనం నచ్చింది. ముఖ్యంగా పెరుగు, దిల్‌పసంద్ స్వీట్స్ రుచి అద్భుతంగా అనిపించాయి. ఇక్కడి విద్యార్థులు స్నేహితుల్లా కలిసిపోయి ప్రేమపూర్వకంగా పలకరించిన తీరు ఎంతో ఆకట్టుకుంది.

– **కవిత**, టెన్త్ విద్యార్థిని, జేఎన్‌వీ సూరత్‌గఢ్, భోపాల్ రీజియన్

పిల్లలను బడిలో చేర్పించాలి

ఎంఈవో సాంబశివరావు



శావల్యాపురం: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారందరూ బడిలో చేరేలా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శని వారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలన్నారు. అన్ని పాఠశాలల్లో సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులు బోధన డైరీలను వినియోగించాలన్నారు. ఎఫ్ఎ-1 పరీక్ష ఫలితాలను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ చైర్మన్ బొడ్డపాటి విజయలక్ష్మి, సెక్రటరీ బిళ్ళా రాజారమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపయ్య చవితి ఉత్సవాలు



నృత్యకళాకారులతో డాక్టర్ గోపిరెడ్డి



రామిరెడ్డిపేట విజయగణపతి ఉత్సవ కమిటీ చవితిపందిరిలో షీల్డు అందుకుంటున్న డాక్టర్ గోపిరెడ్డి



షరాఫ్‌బజార్‌లో వినాయక విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

నరసరావుపేట: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని చవితి పందిళ్లలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి రామిరెడ్డిపేట పాత పోస్టాఫీసు సెంటర్‌లో విజయ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చవితి పందిరిని డాక్టర్ గోపిరెడ్డి సందర్శించారు. ఆయనకు కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన గణపతి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. శనివారం పట్టణంలోని రామిరెడ్డిపేట పాతసమితి కార్యాలయం వద్ద సిద్ధిబుద్ధి కమిటీ ఏర్పాటుచేసిన గణేష్ మండపాన్ని డాక్టర్ గోపిరెడ్డి సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని పట్టణంలోని వినాయకచవితి పందిళ్లను శుక్రవారం రాత్రి సందర్శించారు. పట్టణంలోని షరాఫ్‌బజార్, చలివేంద్రబజార్, స్టీలు కొట్లబజార్, పురుషోత్తమపట్నంలో ఏర్పాటు చేసిన చవితి మండపాల్లోని వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద స్థానికులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొప్పురావూరి పటేల్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు సాపా సైదావలి ఉన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కోదండ రామాలయంలో కొలువై ఉన్న ఆరడుగుల మట్టి వినాయక విగ్రహానికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రధాన పూజారులు దర్శి అనిల్‌కుమార్‌శర్మ, ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. కాటా సూర్యనారాయణ ఆర్థిక సాయంతో అందించిన 18 కేజీల లడ్డు ప్రసాదాన్ని రూ.45,500కు కాటా శ్రీనివాసరావు వేలంలో దక్కించుకున్నారు. 15 కేజీల లడ్డును కిలారు వేణు అందించగా రూ.18 వేలకు దొంతు కుమార్ దక్కించుకున్నారు. మట్టి విగ్రహాన్ని ఆలయం ముందే జలాధివాసం నిర్వహించి మహిళలు బిందెలతో నీరు పోసి కరిగే అంతవరకు నిమజ్జనం చేశారు. అనంతరం విగ్రహం నుంచి వచ్చిన మట్టిని భక్తులు తమ ఇళ్లకు తీసుకు వెళ్లారు. ఈ మట్టిని ఇళ్లల్లో, పొలాల్లో తులసీ, పూల మొక్కలపై చల్లితే శుభం కలుగుతుందని భక్తులు తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాటా వెంకటేశ్వర్లు, జంపని వెంకటరత్నం, గౌరవ అధ్యక్షులు కెల్లంపల్లి సుందరరావు, మాజీ కమిటీ అధ్యక్షులు మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నార్నె శివ, ట్రెజరర్ గుర్రం ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి గాలి బుచ్చియ్య తదితరులు పాల్గొన్నారు. మండలం పరిధిలో 20 విగ్రహాలను నిమజ్జనం చేశారు.



లడ్డును వేలంలో దక్కించుకున్న కాటా శ్రీనివాసరావు, దొంతు కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు

కారుచోలలో..

యడ్లపాడు: మండలంలోని కారుచోల గ్రామంలో యాదవరాజులు, రెడ్డి, రజకులు ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. ముందుగా గణనాధుల వద్ద పూజలు చేసి, లడ్డు వేలంపాట నిర్వహించారు. అనంతరం సమీపానే ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలభిషేకం చేశారు. అనంతరం తీన్‌మాన్, డీజే వాయిద్యాలతో జైజగన్, జైజై రజిని నినాదాలతో ఉత్సాహంగా బయలుదేరారు. భారీ జన సందోహం నడుమ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై స్వామి విగ్రహాన్ని పెట్టుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి, ఆద్యంతం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



గణనాధుని తీసుకెళ్తున్న కారుచోల వాసులు

ఏకాగ్రతతో విద్యనభ్యసిస్తే లక్ష్యాలు సాధించవచ్చు

వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్

ఎన్ఈసీలో ఓరియెంటేషన్ డే



నరసరావుపేట రూరల్: ఏకాగ్రతను పెంచుకొని ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించుకోవచ్చని ప్రముఖ నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 28వ ఓరియెంటేషన్ డే శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యండమూరి మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదవడం ద్వారా రాణిస్తారని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో విద్యార్థులకు వివరించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ 1998లో నాలుగు బ్రాంచీలతో 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాలలో నేడు 6 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ ప్లేస్‌మెంట్స్ అత్యాధునిక వసతుల కల్పనలో కళాశాల దేశంలో ఉన్నత స్థానంలో ఉందన్నారు. ఈ ఏడాది 50 కంపెనీల ద్వారా 1250 మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించినట్టు వివరించారు. కార్యదర్శి మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ చెడువ్యసనాలకు దూరంగా క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, డీన్ డాక్టర్ పి.హరికృష్ణ, హెచ్‌వోడి డాక్టర్ పొన్నూరి లక్ష్మి పాల్గొన్నారు.

పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయా?

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ప్రశ్న

చిలకలూరిపేట: పట్టణంలో అసలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారా.. లేదా? మాకైతే ఎక్కడా కొత్తగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కనిపించటం లేదు అంటూ ఏడోవార్డు కౌన్సిలర్ చెమిటిగంటి పార్వతి ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శనివారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. కౌన్సిలర్ అడిగిన ప్రశ్నకు మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్వహించిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సమాధానం చెప్పారు. నిధులు అందుబాటును బట్టి కొత్త పనులు చేపడతామని చెప్పారు. 38వ వార్డు కౌన్సిలర్ జంగా సుజాత మాట్లాడుతూ వార్డులో రెండు రోడ్ల నిర్మాణం కోసం ఎప్పటి నుంచో అడుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి డీఈఈ మాట్లాడుతూ రెండు పనులకు టెండర్లు పిలిచామని, టెండర్ ప్రక్రియ ముగిశాక పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. కౌన్సిలర్ తిరిగి ప్రశ్నిస్తూ ఎప్పుడు టెండర్ ప్రక్రియ ముగుస్తుందని ప్రశ్నించారు. సెప్టెంబర్ ఆరోతేదీ వరకు గడువు ఉందని, ఇప్పటి వరకు ఎవరూ టెండర్ దాఖలు చేయలేదని చెప్పారు. సంబంధిత కౌన్సిలర్ తిరిగి మాట్లాడుతూ ఎవరూ టెండర్ వేయకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ దశలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని జోక్యం చేసుకొని ఎవరూ టెండర్లు వేయకపోతే ఆరోతేదీ తర్వాత కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుందామని హామీ ఇచ్చారు.



అధ్యక్షత వహించిన షేక్ రఫాని

పదో వార్డు కౌన్సిలర్ షేక్ మౌలాలి మాట్లాడుతూ పట్టణంలో కేవలం కేబీరోడ్డు, ఎన్ఆర్‌టీ రోడ్డులో మాత్రమే కాకుండా అన్ని చోట్ల ఆక్రమణలు తొలగించాలని, అలా కాకుండా ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపితే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమకు ఆక్రమణల తొలగింపులో ఎలాంటి వివక్ష ఉండదని చెప్పారు. ఎక్కడో ఒక చోట ఆపాలని ఎవరూ ఒత్తిడి తేకుండా ఉండాలని కోరారు. 34వ వార్డు కౌన్సిలర్ వడితే కోట్యానాయక్ మాట్లాడుతూ కంప పెరిగిన ప్రదేశాల్లో జంగిల్ క్లీనింగ్ చేయించాలని కోరారు. ఆ పనులు చేపడతామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఎజెండా చదవడం పూర్తి అయ్యాక చైర్మన్ సమావేశాన్ని ముగించారు.

మందు బాబులూ... ఇదేం పనీ?

శావల్యాపురం: మందు బాబులు మత్తులో సీసాలు పగలకొట్టి మాగాణి పొలాల్లో ఇష్టానుసారంగా పడివేయటం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్ శనివారం తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కాగా ఈ నేపథ్యంలో రైతులు సాగు చేసుకుంటున్న మాగాణి పొలాల్లో మద్యం తాగి సీసాలను పగలికొట్టి వదిలివేసి వెళ్లటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా రహదారి మార్గం పక్కనే ఉన్న పొలాల్లో తరుచూ ఇలాంటి సంఘటనలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ఈ విధంగా చేయటం వలన రైతులు పొలం పనులు చేస్తున్న సమయంలో సీసా పెంకులు వలన రైతులు అగచాట్లు పడుతున్నారన్నారు. మండలంలోని బొందిలిపాలెం శానంపూడి వెళ్లే రహదారి మార్గాల్లో మద్యం బాబులు ఆగడాలతో పొలాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలకు పాల్పడి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామ సమీప పొలాల్లో శనివారం విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన వీర్ల లింగయ్య కు చెందిన ఎద్దు గ్రామ సమీపంలోని పొలంలో మేతకు వెళ్లింది. ఆ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్ద మేత మేస్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ. 70 వేలు విలువ ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. గత రెండేళ్లుగా గ్రామ పొలాల్లో పశువుల మేతకు వెళ్లిన ఆరు ఎద్దులు మృతి చెందాయని బాధిత రైతులు వాపోతున్నారు. పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫారం చుట్టూ పశువుల మేత అల్లుకొని ఉండటంతో ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సిబ్బంది చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు

15 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తింపు

త్వరలో కళ్లజోళ్లు అందజేస్తామని వైద్యులు వెల్లడి



యడ్లపాడు: జాతీయ 40వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం ఇంటర్ విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. మండల కేంద్రమైన యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని ప్లస్ టూ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు అమరావతికి చెందిన కంటి వైద్యనిపుణులు పి.శివరామ సుబ్బారావు హాజరై దృష్టి పరీక్షలు చేశారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో స్థానిక వైద్యశాల వైద్యాధికారి భరద్వాజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలో కంటి శిబిరాన్ని ఏర్పాటు చేసి 6 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందించినట్లు వెల్లడించారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ప్రభుత్వం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా శనివారం ఇంటర్ విద్యార్థినులకు పరీక్షలు చేయగా 15 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. త్వరలో వారికి కళ్లజోళ్లను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.విజయభారతి, సీహెచ్‌వో పున్నారావు, ఏఎన్ఎం నాగమణి, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా మాలిక్ షా



వినుకొండ: వినుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా మాలిక్‌షా నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై వినుకొండ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇన్‌చార్జిగా పనిచేసిన అజీమ్ మున్నీసాబేగం వినుకొండలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

నేడు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట

నరసరావుపేట: పట్టణంలో ఆదివారం ఉదయం ఏడుగంటలకు గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జొన్నలగడ్డ బ్రాంచ్ (01924), జొన్నలగడ్డ, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522601

(APPENDIX-IV) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002) లోని రూల్ 8(1) ప్రకారం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జొన్నలగడ్డ బ్రాంచ్, జొన్నలగడ్డ, పల్నాడు జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత(లు)/హామీదారు(లు): శ్రీమతి బెజవాడ రజనీ (ఋణగ్రహీత)**, భర్త: లక్ష్మీకాంత రావు, ఫ్లాట్ నెం.204, మొదటి అంతస్తు, అంజనా టవర్స్, సత్తెనపల్లి రోడ్డుకు పడమర వైపు, నరసరావుపేట, పల్నాడు జిల్లా. **శ్రీ బెజవాడ లక్ష్మీ కాంత రావు (సహ-ఋణగ్రహీత)**, తండ్రి : ఉమామహేశ్వర రావు, ఫ్లాట్ నెం.204, మొదటి అంతస్తు, అంజనా టవర్స్, సత్తెనపల్లి రోడ్డుకు పడమర వైపు, నరసరావుపేట, పల్నాడు జిల్లా వారు హెచ్‌ఎల్ అకౌంట్ నెం.**32398555452** నకు చెల్లించవలసిన బకాయి తేది: **19-06-2025** నాటికి **రూ.4,48,875/-** (అక్షరాల నాలుగు లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) + ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.19-06-2025**న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

ఋణగ్రహీతలు మరియు హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది. 26-08-2025**న **స్వాధీనత తీసుకోవడమైనదని** ప్రత్యేకంగా ఋణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు బహుముఖముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **తేది: 19-06-2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.4,48,875/-** (అక్షరాల నాలుగు లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జొన్నలగడ్డ బ్రాంచ్, జొన్నలగడ్డ, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్** వారి ఛార్జీకి లోబడి వుండునని బహుముఖముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడముపై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు-ఎ: పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, నరసరావుపేట సబ్ డిస్ట్రిక్ట్, నరసరావుపేట మున్సిపాలిటీ, సత్తెనపల్లి రోడ్డుకు పడమర వైపు, నరసరావుపేట రెవెన్యూ గ్రామం, డి.నెం. 86, సమీప డోర్ నెం.**1-21-10**కు ఉత్తరం వైపున మొత్తం 938.33 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో 23.45 చ॥గ॥లు లేదా 19.61 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో నిర్మించిన "అంజనా టవర్స్" అను పేరు గల అపార్ట్‌మెంట్ యావత్తు ఆస్తి. **అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు:** తుపాకుల సుబ్బారావు గారి స్థలం - 60'.00", **దక్షిణం :** 12 అ॥ల వెడల్పు రోడ్డు - 140'.9", **పడమర :** షేక్ మౌలాలి గారి భూమి - 60'.00", **ఉత్తరం :** మున్సిపల్ రోడ్డు - 140'.9".

షెడ్యూలు-బి: పైన తెలిపిన ఎ షెడ్యూలు ఆస్తి మొత్తంలో 23.45 చ॥గ॥లు లేదా 19.61 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో గల "అంజనా టవర్స్" మొదటి అంతస్తు నందు 907 చ॥అ॥లు ప్లింత్ ఏరియా (కామన్ ఏరియాతో సహా) మరియు కార్ పార్కింగ్‌తో గల ఫ్లాట్ నెం.204 రిజిస్టర్డు సేల్ డాక్యుమెంట్ నెం.20728/2011, తేది.18.11.2011 ప్రకారం శ్రీమతి బెజవాడ రజనీ, భర్త : లక్ష్మీకాంత రావు గారికి చెందినది. **ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు:** ఫ్లాట్ నెం.204 & 206కు మధ్య గల ఓపెన్ ఏరియా, **దక్షిణం :** ఫ్లాట్ నెం.204 & 203కు మధ్య గల ఓపెన్ ఏరియా, **పడమర :** కామన్ కారిడార్ మరియు లిఫ్ట్, **ఉత్తరం :** అంజనా టవర్స్ ఓపెన్ ఏరియా.

తేది : 26-08-2025
ప్రదేశం : జొన్నలగడ్డ

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా